క్లుప్తంగా

ఘనంగా కపోతేశ్వర స్వామి తిరునాళ్ల



నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామం శ్రీగంగా భ్రమరాంబ సమేత శ్రీ కపోతేశ్వర స్వామి ఆలయ వార్షిక తిరునాళ్ల ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శిబిచక్రవర్తి కాలంనాటి ఆలయంగా మహిమాన్విత చరిత్ర ఉండటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు వెంకట్రామయ్య శర్మ ఆధ్వర్యంలో ఉదయం 5గంటల నుంచి విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, మేలుకొలుపుతో పూజాధికాలు ప్రారంభించారు. బలిహరణ, రుద్ర హోమం భక్తిశ్రద్ధలతో జరిపించారు. స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పుర వీధుల్లోకి వచ్చిన స్వామివారికి మహిళా భక్తులు వార్లు పోసి, మొక్కులు చెల్లించారు. ఎదురుకోలు సాంప్రదాయ బద్ధంగా జరిపించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించారు. ఎస్ఐ పి.రాంబాబు గట్టి బందోబస్తు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ



గుడిపాడు(క్రోసూరు): గుడిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ జెండాను శనివారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జెండా నమ్మకం అనే పునాదిపై పుట్టినది అని అభివర్ణించారు. విపరీతమైన ప్రజాదరణ, నమ్మకం కారణంగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావటం జరిగిందన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రజలు పట్టం కట్టారన్నారు. అదే పట్టుదల, నమ్మకంతో వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పొత్తూరి రామకృష్ణరావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, గార్లపాటి దాసు, ఎంపీపీ పి.కోటయ్య, పొత్తూరి శంకర్ పాల్గొన్నారు.

దేవదాయ పరిధిలోకి పోలేరమ్మ ఆలయం



సత్తెనపల్లి: పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన వడ్డవల్లి గ్రామ దేవత పోలేరమ్మ దేవాలయాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోకి తెస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆలయాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవకాశం ఏర్పడింది.

అమ్మవారికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట ఈస్ట్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు పట్టణానికి చెందిన జవ్వాజి హనుమత్ సత్యనారాయణ విజయలక్ష్మీ, వెంకటరమేష్ ఆదిలక్ష్మీ దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందించారు. ఆదివారం ఆలయానికి వచ్చిన దాతలు ఆలయ ఈఓ టి.సుధాకరరెడ్డి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఈఓ సుధాకరరెడ్డి మాట్లాడుతూ, ఆలయ పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలని కోరారు. విరాళం అందించే దాతలకు ఆదాయపు పన్ను సెక్షన్ 80జి క్రింద మినహాయింపు ఉంటుందని తెలిపారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు

విజయపురిసౌత్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్ విజయపురిసౌత్ ఎస్ఐ కె.వెంకట కొండారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని విజయపురిసౌత్, చింతల తండా గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రధాన రహదారి వెంట పోలీసు అధికారులు, సాయుధ పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ కె.సురేష్ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవడం కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురికావద్దన్నారు. కుల, మత, పేద, ధనిక అనే తేడా లేకుండా ఓటు హక్కు అందరికీ సమానమని చెప్పారు. ఓటు అనే పవిత్ర ఆయుధాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



అచ్చంపేట: చెరుకుంపాలెంలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన జెడ్పీటీసీ విజయప్రతాప్‌రెడ్డి



అచ్చంపేట నుంచి బయలుదేరిన అభిమాన గణం



పరస గ్రామం నుంచి విజయకేతనం చూపుతూ..



ముప్పాళ్ళ: జెండా ఊపి ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు

రామదండులా..

- సిద్ధం సభకు భారీగా తరలివెళ్లిన ప్రజానీకం
- పెదకూరపాడు నియోజకవర్గం నుంచి 250 బస్సులు, 100 కార్లు
- సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి 322 ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు
- 122 కార్లలో సభా ప్రాంగణానికి భారీగా తరలిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- సిద్ధం సభతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్

పెదకూరపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అద్దంకిలో నిర్వహించిన సిద్ధం సభకు పెదకూరపాడు నియోజకవర్గంలోని పెదకూరపాడు, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట మండలాలు నుంచి ప్రజలు, అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో స్వచ్ఛందంగా తరలారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి 250 బస్సులు, 100 కార్లు, 100 ద్విచక్ర వాహనాల్లో సభకు వెళ్లారు. క్రోసూరులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు జెండా ఊపి ప్రారంభించారు.

జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే నంబూరు

క్రోసూరు: మండలం నుంచి బయలుదేరిన సిద్ధం బస్సులను ఎమ్మెల్యే నంబూరుశంకరరావు జెండా ఊపి ప్రారంభించారు. నియోజకవర్గం నుంచి సుమారు 15 వేల నుంచి 18 వేల మంది సభకు హాజరువుతున్నట్లు తెలిపారు. సిద్ధం సభతో వైఎస్సార్ సీపీ తడాఖా ఏమిటో తెలుస్తుందన్నారు.

తరలిన అభిమాన గణం

అచ్చంపేట: మండలం నుంచి భారీగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధం సభకు తరలివెళ్లారు. ప్రత్యేక బస్సులను చెరుకుంపాలెంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు.



సిద్ధం సభకు వెళ్తున్న బస్సులను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

మండలం నుంచి సుమారు పది వేలకు పైగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లినట్లు అంచనా.

తరలిన జగన్ సైన్యం

సత్తెనపల్లి: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 175 సీట్లకు 175 స్థానాల్లో గెలుపొందేలా పార్టీ శ్రేణులకు దిశా, నిర్దేశం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదివారం బాపట్ల జిల్లా మేదరమెట్ల సిద్ధం సభకు వస్తున్న సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో 322 ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను, 120 కార్లను ఏర్పాటు చేసుకొని సిద్ధం సభను విజయవంతం చేసేందుకు సుమారు 15 వేల మందికి పైగా తరలి వెళ్లారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తోనే సాధ్యమని వారు స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జనం జేజేలు కొట్టారు. మేదరమెట్లలో సిద్ధం సభకు సత్తెనపల్లి పట్టణం నుంచి 55, సత్తెనపల్లి రూరల్ మండలం నుంచి 90, ముప్పాళ్ళ మండలం నుంచి 37, రాజుపాలెం మండలం నుంచి 78, నకరికల్లు మండలం నుంచి 60 ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు. ఇవిగాక 120 కార్లు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. వైఎస్సార్ సీపీ నాయకులు సమకూర్చిన ప్రత్యేక వాహనాలే కాకుండా సొంత వాహనాల్లోనూ ఉత్సాహంతో వెళ్లారు. సంక్షేమ పథకాలను కొనసాగించుకునేందుకు తామంతా సిద్ధమంటూ సీఎంకు జయ జయ ధ్వానాలు పలికారు. జై జగన్ .. జై జై జగన్.. వర్థిల్లాల్లి అంబటి రాంబాబు నాయకత్వం అంటూ నినదించారు. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా .. ఉల్లాసంగా సిద్ధం సభకు తరలి వెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభి మానులు ఉన్నారు.

ముప్పాళ్ళ: సిద్ధం సభకు మండలం నుంచి మొత్తం 35 బస్సులు, 10 ప్రైవేట్ వాహనాలతో పాటుగా 15 కార్లలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సిద్ధం సభకు వెళ్లే వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, శిరిగిరి గోపాలరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సత్తెనపల్లి: పట్టణంలోని 27వ వార్డులో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మౌలాలి



బెల్లంకొండ నుంచి సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



సత్తెనపల్లి: 20వ వార్డు నుంచి..



సత్తెనపల్లి: ఒకటవ వార్డు నుంచి..



సత్తెనపల్లి: 19వ వార్డు నుంచి..



సత్తెనపల్లి: పెద్దమక్కెన నుంచి..

సత్రశాల దేవస్థానంలో ప్రత్యేక పూజలు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసి ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో ప్రధాన అర్చకులు చిట్టేల మల్లిఖార్జున శర్మ నేతృత్వంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా గత ఏడాది కన్నా ఈ ఏడాది రూ.1.60 లక్షల ఆదాయం తగ్గినట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మానందరెడ్డి, ఈవో బుర్రి నెమిలిరెడ్డి తెలిపారు. మహా శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయడానికి సహకరించిన వివిధ శాఖల అధి కారులకు, ప్రజా ప్రతినిధులకు, స్వచ్ఛందంగా వలంటీర్లుగా సేవలు అందించిన యువతీయువకులకు, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం వారికి, ఏపీ జెన్‌కో నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు అధికారులకు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ బాపనపల్లి శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




సత్రశాలలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శివయ్యస్వామి

బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిని ఓడించాలి

సత్తెనపల్లి: రాష్ట్రానికి అన్ని విధాల ద్రోహం చేసిన బీజేపీని, ఆ పార్టీని బలపరుస్తున్న టీడీపీ, జనసేన పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం సత్తెనపల్లి పట్టణ పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సమావేశానికి పార్టీ నేత అనుముల వీరబ్రహ్మం అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ సమాజాన్ని తిరోగమన దిశలో బీజేపీ నడిపిస్తోందని, ఫలితంగా వ్యవసాయం దివాలా తీయించి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కృషి చేస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక హక్కులను కాలరాసి 4 కార్మిక కోడ్‌లు తీసుకువచ్చిందన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడే వారంతా బీజేపీని, దానిని బలపరిచే శక్తులను రాబోయే ఎన్నికలలో ఓడించేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 11న ఎస్‌బీఐ సత్తెనపల్లి బ్రాంచ్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాల్లో ప్రజానీకమంతా అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, కమిటీ సభ్యులు గద్దె ఉమాశ్రీ, మునగాజ్యోతి, పంతంగి ప్రభాకర్, రొంపిచర్ల పురుషోత్తం, షేక్ సాయిబా, సీపీఎం సీనియర్ నాయకులు గుంటూరు వేమయ్య పాల్గొన్నారు.

స్త్రీల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే కృషి

సత్తెనపల్లి: స్త్రీ విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘ నాయకుడు గుంటూరు గోవిందు కొనియాడారు. పట్టణంలోని ఎన్‌జీఓ హోం సెంటర్‌లో సావిత్రి బాయి పూలే 127వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సంఘ నాయకుడు మంగళపూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయని, రచయిత్రి సావిత్రిబాయి పూలే నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు అని కొనియాడారు. తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్ట మొదటిసారిగా బాలికల పాఠశాలను ప్రారంభించిందన్నారు. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా మహిళల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా విశ్వసించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు కుమ్మరి దస్తగిరి, కంటూ వెంకట రామయ్య, పిక్కిలి శివ, గొల్లపల్లి శివ నాగ రాజు, మల్లా వెంకటేశ్వర్లు, నర్రా కృష్ణ, ప్రత్తిపాటి హరే కృష్ణ, వై. శ్రీనివాస్ యాదవ్, సుబ్బారావు, షేక్ వెల్లంకి బాబు, వెంకటేశ్వర్లు, రత్తయ్య, ఆంజనేయులు, షేక్ చిన్న షరీఫ్, క్యాలిబర్ జానీ పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి

విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్ మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తుల మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షిణ నిర్వహించారు. జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీజ్ చేసిన వాహనం దగ్ధం

సిగరెట్ పీక పడవేయటంతో ప్రమాదం



నరసరావుపేట టౌన్: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకొని పోలీస్ స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన వాహనం దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లో కెళ్లితే.. రోడ్డు ప్రమాదం కేసు లో సీజ్ చేసిన మినీ ఆటోను భద్రత నిమిత్తం నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంచారు. మూత్ర విసర్జనకు ఆటువైపుకు వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తి కాల్చిన సిగరెట్ పీకను అక్కడ పడవేశాడు. ఆటో పక్కనే ఉన్న పిచ్చికంప తగలబడి మంటలు మినీవ్యానులోకి వ్యాపించాయి. దీంతో మినీవ్యాను పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

నేడు రూ.12 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

అమరావతి: నియోజకవర్గప్రజలు ఎన్నడు చూడని విధంగా, పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని లేమల్లె, మండెపూడి, చిన్నమక్కెన, పెదకూరపాడు, లగడపాడు, ఉయ్యందన, హసనాబాద్ గ్రామాలలో సుమారు రూ.12కోట్లతో జరిగిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సోమవారం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేమల్లెలో రూ.10కోట్లతో నిర్మించిన కోల్డ్ స్టోరేజ్, మండెపూడిలో మల్టీపర్పస్ మార్కెటింగ్ గొడౌన్, పెదకూరపాడు మండలం చిన్నమక్కెనలో ప్రాథమిక పాఠశాల భవనం, పెదకూరపాడులో గ్రామ సచివాలయం-2, లగడపాడులో గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తారని, అనంతరం మధ్యాహ్నం 2గంటలకు క్రోసూరు మండలంలోని ఉయ్యందన బీసీ కమ్యూనిటీ హాల్‌ను, సాయంత్రం 4గంటలకు హసనాబాద్‌లో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

తెలుగు తమ్ముళ్లది తలో దారి



భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయుల మజ్జిగ పంపిణీ..

- అమరేశ్వరుని సాక్షిగా రెండుగా చీలిన కార్యకర్తలు
- విడివిడిగా మజ్జిగ పంపిణీ
- సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శలు
- నమ్మిన వారే ముంచుతున్నారని అంటున్న కొమ్మాలపాటి వర్గం

పెదకూరపాడు: అమరేశ్వరుని సాక్షిగా తెలుగు తమ్ముళ్లు రెండు వర్గాలు చీలిపోయి కార్యక్రమాలు చేస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి ఎంపిక చేయడం అధిష్టానం అలస్యం చేయడంతో తెలుగు తమ్ముళ్లు తలో దారి చూసుకుంటున్నారు.

మళ్లీ టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ వర్గం ఒక వైపు, నాకే టికెట్ అంటూ నియోజకవర్గంలో హల్‌చల్ చేస్తున్న భాష్యం ప్రవీణ్ వర్గం మరో వైపు చేరి ఒకరిపై ఒకరు సోషల్ మిడియా వేదికగా విమర్శలు చేసుకుంటున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఇరువర్గాల వారు అమరావతిలో భక్తులు అన్నదానం చేశారు. అదే విధంగా ఆదివారం అమరేశ్వరుని రథోత్సవం సందర్భంగా రెండు వర్గాలుగా చీలి ఎవరికి వారు మజ్జిగ, వాటర్ బాటిళ్లు పంపిణి చేయడంతో మళ్లీ ఈ రెండు వర్గాల మధ్య విభేధాలు బయటపడ్డాయి. నిన్న మొన్నటి వరకు కొమ్మాలపాటి శ్రీధర్ వెంట తిరిగిన వారు నేడ భాష్యం ప్రవీణ్ వెంట తిరుగుతుండటంతో కొమ్మాలపాటి వర్గం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. శ్రీధర్ నమ్మిన వారే నట్టే ముంచుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో అనేక గ్రామాల నుంచి అధిక సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయి.

ప్రశాంతంగా 'గురుకుల' ప్రవేశ పరీక్ష

సత్తెనపల్లి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్షకు 117 మంది గైర్హాజరయ్యారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి ప్రవేశానికి ఉదయం నిర్వహించిన పరీక్షకు మొత్తం 190 మందికి గాను 155 మంది, అలాగే మధ్యాహ్నం ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షకు మొత్తం 228 మందికి గాను 209 మంది హాజరయ్యారని ప్రిన్సిపల్ ఎస్. శైలజ తెలిపారు. రామకృష్ణాపురంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు 212 మంది గాను 160 మంది, ఇంటర్మీడియెట్‌కు 101 మందికి గాను 90 మంది హాజరయ్యారు. ప్రశాంత వాతావరణంలో ప్రవేశ పరీక్షలు జరిగాయి.